RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 295 | 16 బుధవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావవలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## గృహ నిర్మాణాలపై మంత్రి సమీక్ష

- అమరావతి సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం
- గృహ నిర్మాణ పనుల పురోగతిపై చర్చ
- పెండింగ్ అంశాలపై అధికారులకు ఆదేశాలు
- లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచన



**అమరావతి, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్:** రాష్ట్ర గృహ నిర్మాణ కార్యక్రమాల అమలుపై గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం అమరా వతి సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహిం చారు. సచివాల యంలోని నాలుగో బ్లాక్‌లో జరిగిన ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి సహా ఉన్నతా ధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యా ప్తంగా కొనసాగుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణ పనులు, లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు, పెండింగ్‌లో ఉన్న పనుల స్థితిగతులపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక అంశాలకు సంబంధించిన పురోగతిని కూడా సమావేశంలో పరిశీలించారు. నిధుల వినియోగం, పెండింగ్ చెల్లింపులు, నిర్మాణ కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు సంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించిన మంత్రి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. గృహ నిర్మాణ కార్యక్రమాల అమలులో జాప్యానికి తావులేకుండా ప్రణాళి కాబద్ధంగా ముందుకు సాగాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా అమలు చేస్తున్న గృహ నిర్మాణ కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు సమన్వ యంతో పనిచేయాలని మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## మారు వేషంలో.. సామాన్యుడిలా పోలవరం ఎమ్మెల్యే



**బుట్టాయగూడెం, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్ ::** టీషర్ట్, గళ్ల లుంగీ, ముఖా నికి మాస్క్ ధరించి సామాన్యుడిలా మారువేషంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఏలూరు జిల్లా బుట్టాయగూడెం తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చిన వారికి అందిస్తున్న సేవలు పరిశీలించారు. సిబ్బంది తీరును గమనించి మండిపడ్డా రు. ఉదయం 11.30 గంటల నుంచి సుమారు గంట పాటు తహసీల్దార్ కార్యాలయంలోనే ఉన్నారు. ఎమ్మెల్యేను ఎవరూ గుర్తు పట్టలేనంతగా మారు వేషంలో వచ్చారు. బుట్టాయగూడేనికి చెందిన మాధవరావు అనే విశ్రాంత ఉపాధ్యాయుడు స్థల వివాదం పరిష్కారం కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. చిత్తశుద్ధితో సేవలు అందించాలని ఆదేశించారు.

## ఆళ్ల నాని ఆకస్మిక మృతి



**ఏలూరు, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖపట్నంలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వార్త వెలుగులోకి రావడంతో ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన ఆకస్మిక మరణం పార్టీ శ్రేణులను, అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆళ్ల నాని 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు. చిన్ననాటి నుంచే సామాజిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరిచిన ఆయన విద్యాభ్యాసాన్ని ఏలూరులోనే పూర్తి చేశారు. సి.ఆర్. రెడ్డి కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాజకీయాల వైపు అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆళ్ల నాని 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ స్థానిక సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించారు. - మిగతా 2లో..

## యుద్ధాల ప్రభావంపై కేఏ పాల్ ఆందోళన



**విజయవాడ, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్:** ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాల ప్రభావంతో నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు అదుపు తప్పి పెరుగుతున్నా యని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ దేశాల మధ్య నెలకొన్న ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నా యని, దాని ప్రభావం సామాన్య ప్రజల జీవితాల పై స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచంలో చోటుచేసుకున్న అనేక యుద్ధాల ప్రభావం కోట్లాది మంది ప్రజలపై పడుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరిగిన 58 యుద్ధాల ప్రభావం దాదాపు 200 దేశాల్లో నివసిస్తున్న 850 కోట్ల మంది ప్రజలపై పడిందని కేఏ పాల్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నుంచి కొనసాగుతున్న అమెరికా–ఇరాన్ సైనిక ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి గురైందని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రపంచ వాణిజ్య మార్గాలు, ఇంధన రవాణా వ్యవస్థలు ప్రభావితమవడంతో ధరలు భారీగా పెరుగుతున్నాయని వివరించారు. మార్కెట్లో గతంలో రూ.100కు లభించిన వస్తువులు ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయించబడుతున్నాయని కేఏ పాల్ తెలిపారు. అలాగే పెట్రోల్, గ్యాస్ ధరలు కూడా గణనీయంగా పెరిగి వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నాయని చెప్పారు. ఇంధన వ్యయాలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు అధికమై, - మిగతా 2లో..

# ఆర్టీజీఎస్ సేవలపై సీఎం సమీక్ష

- క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్‌పై సమీక్ష సమావేశం
- పౌరసేవలు, పథకాల అమలుపై అధికారులతో చర్చ
- సేవల నాణ్యత పెంపుపై సీఎం సూచనలు



**అమరావతి, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో పౌరసేవల అందుబాటు, సంక్షేమ పథకాల అమలు, సాంకేతిక ఆధారిత పాలనపై మరింత దృష్టి సారిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ప్రస్తుతం అమలులో ఉన్న సేవలు, వాటి ప్రభావంపై వివరాలను సమర్పించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చేపడుతున్న చర్యలపై సీఎం అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యర్థనల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థవంతంగా చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా వివిధ ప్రభుత్వ పథకాల - మిగతా 2లో..

## రైజ్ గ్లోబల్ క్యాంపస్ లోగో ఆవిష్కరణ




**శ్రీకాకుళం, సెప్టెంబర్ 15రాజధాని వాయిస్ :** ఇచ్ఛాపురం నుంచి న్యూ జనరేషన్ ఎడ్యుకేషన్‌కు శ్రీకారం చుడుతూ శాంకరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 'రైజ్ గ్లోబల్ క్యాంపస్' లోగోను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా ప్రపంచ స్థాయి విద్య అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆ దిశగా రైజ్ గ్లోబల్ క్యాంపస్ చేపడుతున్న ప్రయత్నాలు అభినందనీయమని అన్నారు. మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందుకోవాలనే లక్ష్యంతో - మిగతా 2లో..

## ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై

# చంద్రబాబు సీరియస్..

- కఠిన చర్యలకు ఆదేశం



**అమరావతి,రాజధాని వాయిస్:** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరే కంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల - మిగతా 2లో..

## హోంవర్క్ సున్నా.. ఆరోపణలు వంద..

ఇదే ఆ ఛానల్ పరిస్థితి: మంత్రి అచ్చెన్న




**అమరావతి రాజధాని వాయిస్:** నిరుద్యోగుల అవకాశాలపై సాక్షి విషం చిమ్ముతోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఐదేళ్లపాటు ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా వైసీపీ భర్తీ చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 160 వెటర్నరీ డాక్టర్ పోస్టుల భర్తీకి అనుమతిచ్చిందని వెల్లడించారు. ఉద్యోగాలు ఇస్తుంటే ఓర్వలేక.. తప్పుడు కథనాలతో అడ్డుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అభ్యర్థులు కోరిన విధానాన్నే అమలు చేస్తే అక్రమమా? అని ప్రశ్నిం చారు. ఎనిమిదేళ్లుగా నియామకాలు జరగలేదని నిరుద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసిందని తెలిపారు. ఈ ఒక్కసారికి పాత వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. G.O.Ms.No.52 ప్రకారం మెరిట్, వెయిటేజీ ఆధారంగా నియామక విధానం ఉందన్నారు. BVSc మార్కులకు 60, MVScకు 10, కాంట్రాక్ట్ సేవలకు 10 మార్కుల వెయిటేజీ కేటాయించినట్లు తెలిపారు. అలాగే సీనియారిటీకి ప్రతి ఏడాదికి 4 మార్కుల చొప్పున వెయిటేజీ ఇవ్వనున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా 20 మార్కుల వెయిటేజీ - మిగతా 2లో..

## విజయవాడ కార్పొరేషన్ డివిజన్లు 86కి పెంపు.. గెజిట్ విడుదల

**విజయవాడ, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్: :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో డివిజన్లు, వార్డుల సంఖ్యను పెంచుతూ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే కీలకమైన విజయవాడ నగర పాలక సంస్థలో డివిజన్ల సంఖ్యను గణనీయంగా పెంచింది. ఇప్పటివరకు విజయవాడ కార్పొరేషన్‌లో 64 డివిజన్లు ఉండగా, కొత్తగా మరో 22 డివిజన్లను జోడించి మొత్తం సంఖ్యను 86కు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఈ ఏడాది మే నెలలోనే డివిజన్ల పెంపు ప్రతిపాదనలు తెరపైకి రాగా....మే 18 నుంచి 24 వరకు ప్రజలు, వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు, సూచనలను అధికారు లు స్వీకరించారు. ఈ పునర్విభజన ప్రక్రియలో అత్యధిక మార్పులు విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోనే చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు తూర్పు నియోజకవర్గంలో ఉన్న 21 డివిజన్ల సంఖ్య కాస్తా 29కి చేరాయి. ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరాలేవీ రాకపోవడంతో అధికారులు 86 డివిజన్ల జాబితాను అధికారికంగా ఖరారు చేశారు.



## తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్ల కేటాయింపు: కేంద్ర మంత్రి పెమ్మసాని

**అమరావతి, సెప్టెంబర్ 15రాజధాని వాయిస్:** తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం 5 లక్షల ఇళ్లు కేటాయించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయిం చినట్లు వెల్లడించారు. 2024లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చేసిన కేటాయింపుల కంటే ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాలకు ఇంత పెద్ద మొత్తంలో కేటాయించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. "2019-24 మధ్య కాలంలో ఏపీకి 1.78 లక్షల ఇళ్లు కేటాయించగా.. దానిలో కేవలం 42వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 2019-24 మధ్య గ్రామీణ ఆవాస యోజన పథకంలో తెలంగాణ చేరలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రెండుమూడు సార్లు ఇళ్ల కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువగానే ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం తరఫున రూ.1.20 లక్షల ప్రాథమిక ఆర్థిక సాయం అందిస్తాం. అదనపు సాయంతో దాదాపు రూ.1.80 లక్షల వరకు లబ్ధి చేకూరుతుంది. స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్డికి రూ.12 వేల సహాయం అందిస్తాం. ఆవాస్ ప్లస్ యాప్‌తో పారదర్శకంగా ఎంపిక జరుగుతుంది. జియో ట్యాగింగ్‌తో లబ్ధిదారుల నమోదుకు కేంద్రం సెల్ఫ్ సర్వే సదుపాయం కల్పించింది. ఆదాయ అర్హత పరిమితి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మోటార్ బైక్, ఫ్రిజ్ ఉన్నా అర్హత కోల్పోకుండా సవరణలు చేసింది. కొత్త, పాత ఇళ్లన్నీ 2-3 ఏళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల కేటాయింపు జరుగుతుంది" అని మంత్రి పెమ్మసాని వెల్లడించారు.

# ఆళ్ల నాని ఆకస్మిక మృతి

2009లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి తన రాజకీయ బలాన్ని చాటుకున్నారు. ఏలూరులో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఏర్పడటానికి ఈ కాలం కీలకంగా మారింది.రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2013లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆళ్ల నాని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ కరోనా కాలంలో కీలక నిర్ణయాల్లో భాగస్వామ్యమయ్యారు.గత ఎన్నికల అనంతరం వైసీపీని వీడిన ఆళ్ల నాని రాజకీయంగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 2025 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. వివిధ పార్టీల్లో పనిచేసినా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ ప్రత్యర్థులతో కూడా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం ఆయన వ్యక్తిత్వంలోని విశేషంగా చెప్పబడుతోంది.ఆళ్ల నాని మృతి పట్ల రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు. ప్రజా జీవితంలో మూడు దశాబ్దాలకుపైగా కొనసాగిన ఆయన రాజకీయ ప్రయాణం అకస్మాత్తుగా ముగియడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీరని లోటుగా భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని (కాళీ కృష్ణ శ్రీనివాస్) అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేవలం 56 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో ఆళ్ల నాని మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఆయన మరణం రాజకీయ రంగానికి తీరని లోటని అభిప్రాయపడుతూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆళ్ల నాని మృతి నేపథ్యంలో చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా సంతాప సందేశాన్ని విడుదల చేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తన సానుభూతిని వ్యక్తం చేశారు.రాజకీయ జీవితంలో వివిధ పార్టీల్లో పనిచేసిన ఆళ్ల నాని ప్రజలకు చేరువైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఏలూరు నియోజకవర్గం నుంచి పలుమార్లు ప్రజాప్రతినిధిగా ఎన్నికైన ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన ఆళ్ల నాని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. సౌమ్య స్వభావం, అందరితో కలిసిమెలిసి పనిచేసే తత్వం కారణంగా ఆయనకు రాజకీయ వర్గాల్లో మంచి గౌరవం లభించింది.

# రైజ్ గ్లోబల్ క్యాంపస్ లోగో ఆవిష్కరణ

ఈ విద్యాసంస్థ రూపుదిద్దుకుంటోందని మంత్రి తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు కలిగిన యువతను తీర్చిదిద్దడంలో ఇటువంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూపొందిస్తున్న ఈ క్యాంపస్ విద్యారంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. రైజ్ సంస్థల అధినేత డాక్టర్ ప్రవీణ్ పుల్లట చేపట్టిన ఆలోచన దూరదృష్టితో కూడుకున్నదని అచ్చెన్నాయుడు కొనియాడారు. విద్యను కేవలం తరగతి గదులకు పరిమితం చేయకుండా, విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా రైజ్ గ్లోబల్ క్యాంపస్ ముందడుగు వేయడం సంతోషకరమని చెప్పారు.శ్రీకాకుళం జిల్లా వంటి ప్రాంతాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక నైపుణ్యాలు అందించడం కాలానుగుణ అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా యువతను సిద్ధం చేయాలంటే విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకురావాల్సి ఉంటుందని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పిస్తే ప్రపంచస్థాయిలో రాణించే సామర్థ్యం వారిలో ఉందని పేర్కొన్నారు.పిల్లలలోని ప్రతిభను సరైన సమయంలో వెలికితీసి, వారికి నాణ్యమైన విద్యతో పాటు సరైన దిశానిర్దేశం చేయడం ద్వారా సమాజానికి మంచి నాయకులను అందించవచ్చని మంత్రి చెప్పారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, విలువల ఆధారిత విద్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లక్ష్యాలతో ముందుకు సాగుతున్న విద్యాసంస్థలు రాష్ట్ర విద్యారంగానికి కొత్త ఊపునిస్తాయని తెలిపారు. రైజ్ గ్లోబల్ క్యాంపస్ ద్వారా ప్రాంతీయ విద్యార్థులకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసిన అచ్చెన్నాయుడు, సంస్థ యాజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాసంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



**అమరావతి, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్:** రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన సొంత ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న “హౌసింగ్ ఫర్ ఆల్” కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం గృహ నిర్మాణ శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో గృహహీన కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్, పీఎం జన్‌మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన గృహ నిర్మాణాలను వచ్చే నెలలోగా పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించి నిర్దేశిత గడువుల్లో పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాలో పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ లక్ష్య సాధనకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం 2027 మార్చి నాటికి మొత్తం 5.52 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా 2026 డిసెంబరు నాటికి 2.05 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని, అనంతరం 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. లబ్ధిదారులకు కేవలం ఇల్లు మాత్రమే కాకుండా, తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుధ్య వసతులు వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణాల్లో ఎటువంటి జాప్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు.హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ సంకల్పమని సీఎం పేర్కొన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి సామాజిక భద్రతను కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని చెప్పారు. అందువల్ల గృహ నిర్మాణ కార్యక్రమాలను ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు, ఆర్థిక శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతి, నిధుల వినియోగం, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. లక్ష్యాలను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేసి రాష్ట్రాన్ని గృహహీనత రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి పనిచేయాలని సీఎం అధికారులకు సూచించారు.

# యుద్ధాల ప్రభావంపై కేఏ పాల్ ఆందోళన

దాని ప్రభావం అన్ని రకాల వస్తువుల ధరలపై పడుతోందని వివరించారు.ధనిక వర్గాలపై ఈ ధరల పెరుగుదల ప్రభావం పరిమితంగానే ఉన్నప్పటికీ, పేదలు మరియు మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేఏ పాల్ పేర్కొన్నారు. సమాజంలో దాదాపు 90 శాతం మంది ప్రజలు ద్రవ్యోల్బణ భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కుటుంబాల నెలవారీ ఖర్చులు గణనీయంగా పెరగడంతో జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించారు.ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనకపోతే ధరల నియంత్రణ సాధ్యం కాదని కేఏ పాల్ స్పష్టం చేశారు. యుద్ధాలు ఆగి అంతర్జాతీయ స్థాయిలో స్థిరత్వం ఏర్పడితేనే సరఫరా వ్యవస్థలు సాధారణ స్థితికి చేరుకుని ధరలు తగ్గే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ దేశాలు శాంతి దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ప్రపంచ శాంతి సాధన లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు కేఏ పాల్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాబోయే సెప్టెంబర్ 28న అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ప్రత్యేక ప్రశాంతతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రపంచ నాయకులు, శాంతి కోరుకునే ప్రజలు కలిసి యుద్ధాలకు ముగింపు పలకాలని పిలుపునిస్తూ, గ్లోబల్ పీస్ కోసం తన ప్రయత్నాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# హోంవర్క్ సున్నా.. ఆరోపణలు వంద..

పొందే అవకాశం ఉంటుందన్నారు. తొలుత ఏపీపీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు. APPSCకి ప్రస్తుత పని ఒత్తిడి కారణంగా వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టడం సాధ్యం కాదన్నారు. G.O.Ms.No.22 ద్వారా ఈ ఒక్కసారికి పశుసంవర్ధక శాఖ ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భవిష్యత్ నియామకాలు APPSC పరీక్షా విధానంలోనే ఉంటాయని స్పష్టం చేశారు.సాక్షిలో చెప్పినట్టు ప్రస్తుతం డైరెక్టర్‌గా దామోదర్ నాయుడు లేరని అచ్చెన్నాయుడు చెప్పారు. ఒక మహిళా అధికారి ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. కనీసం డైరెక్టర్ ఎవరో తెలుసుకోకుండా కథనం రాస్తారా? అంటూ మండిపడ్డారు. ‘హోంవర్క్ సున్నా.. ఆరోపణలు వంద.. ఇదే సాక్షి పరిస్థితి’ అని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వడం తమ విధానమని.. ఉద్యోగాలకు అడ్డుపడటం వైసీపీ విధానమని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దని వైసీపీకి హితవు పలికారు. యువతకు న్యాయం చేసే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్..

కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది.

# ఆర్టీజీఎస్ సేవలపై సీఎం సమీక్ష



అమలు తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యతను పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పౌరసేవల డెలివరీలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి, డేటా ఆధారిత నిర్ణయాలతో పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధంగా వ్యవస్థలను అభివృద్ధి చేయాలన్నారు.సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా ఆర్టీజీఎస్ వ్యవస్థ పనిచేయాలని సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి సకాలంలో చేరేలా శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. ప్రజల సంతృప్తే ప్రభుత్వ పనితీరుకు అసలైన కొలమానమని పేర్కొన్నారు. సమీక్ష అనంతరం అధికారులు వివిధ రంగాల్లో అమలవుతున్న పర్యవేక్షణ వ్యవస్థలు, ప్రజా సేవల డిజిటలైజేషన్, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాకేంద్రిత పాలన, వేగవంతమైన సేవలందింపు, సాంకేతిక ఆధారిత పరిపాలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని సమావేశంలో స్పష్టమైంది.

# ఆళ్ల నాని మృతిపై జగన్ దిగ్భ్రాంతి

**విశాఖపట్నం, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్** మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని (56) అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని తన నివాసంలో ఉన్న సమయంలో ఆళ్ల నాని హఠాన్మరణం చెందారన్న వార్త తెలుసుకుని తీవ్రంగా కలత చెందినట్లు తెలిపారు. ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని జగన్ తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆళ్ల నాని ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయ మని కొనియాడారు.శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కూడా ఆళ్ల నాని మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త విని తాను శోకసముద్రంలో మునిగిపోయానని పేర్కొన్నారు. రాజకీయాల్లో స్నేహపూర్వకంగా మెలిగే వ్యక్తిగా ఆళ్ల నాని ప్రత్యేక గుర్తింపు పొందారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు కన్నబాబు, వెల్లంపల్లి శ్రీనివాసరావు సైతం ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థి స్తూ, ప్రజాసేవలో ఆయన చూపిన అంకితభావాన్ని స్మరించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు సంతాప సందేశాలు పంపుతూ నివాళులు అర్పిస్తున్నారు.వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆళ్ల నాని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు తుదివీడ్కోలు పలికారు. ఆయనతో కలిసి పనిచేసిన అనేక మంది నేతలు ఆయన సరళ స్వభావం, ప్రజల పట్ల ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విశాఖపట్నంలో గుండెపోటుకు గురైన ఆళ్ల నానిని ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, గత వైసీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రజా సేవలో విశేష ముద్ర వేసిన ఆళ్ల నాని మరణం రాష్ట్ర రాజకీయాల్లో తీరని లోటుగా మిగిలిపోనుంది.

# ప్రతి హిందువు.. జీవితంలో ఒక్కసారైనా శ్రీవారిని దర్శించుకోవాలి: చంద్రబాబు



**తిరుమల, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్ :** ప్రతి హిందువు.. జీవితంలో ఒక్కసారైనా తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళ వారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి సీఎం హోదాలో 15వ సారి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో సీఎంకు పండితులు వేదాశీర్వచనం అందించారు. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర.. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసా దాలు అందజేశారు. మరో వైపు తిరుమలలో మలయప్పస్వామి బ్రహ్మోత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, కుటుంబ సభ్యులు పెద్దశేష వాహన సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రం సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్థిల్లాలని శ్రీవేంకటే శ్వరస్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీవారికి 15వసారి పట్టువస్త్రాలు సమర్పించే మహద్భాగ్యం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. దేశంలో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా నిలిచి, అభివృద్ధిలో ముందుండేలా స్వామివా రు ఆశీస్సులు అందించాలని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి తెలిపా రు. శ్రీవారి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తితిదే పాలకమండలి, అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ తో భక్తులకు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి అభినందించారు. మన ఆధ్యాత్మిక సంపద, సనాతన సంప్రదాయాలు, సంస్కృతిని రాబోయే తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2027 సంవత్సరానికి సంబంధించిన తితిదే డైరీలు, క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

# లుక్ అవుట్ నోటీసు రద్దు చేస్తే లండన్ వెళ్లిపోతా: యూట్యూబర్ నందన

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్: :** ఆర్థిక మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ రమానందన ఇబ్రహీం పట్నం పోలీసుల ఎదుట మంగళ వారం హాజర య్యారు. డెస్టినీ కన్సల్టెన్సీ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తామ ని, సర్టిఫికెట్ ఆఫ్



స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామంటూ మోసం చేశారని క్రాంతికుమార్ అనే వ్యక్తి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈకేసులో ఆమెకు స్థానిక పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. గత నెల 8న ఇబ్రహీంపట్నం పోలీసులు ఆమెను నాలుగు గంటల పాటు విచారించారు. ఈ నెల 16న మరోసారి విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో.. న్యాయవాదుల సూచన మేరకు ఒక్కరోజు ముం దుగానే ఆమె మంగళవారం పీఎస్‌కు చేరుకున్నారు. సీఐ సుబ్రహ్మ ణ్యం, ఎస్సై రాజు నందనను విచారించారు.గత విచారణలో ప్రశ్నించిన వాటినే పోలీసులు తిరిగి ప్రశ్నించగా దాటవేత సమాధానాలే రావడం గమనార్హం. కన్సల్టెన్సీ ఎవరి పేరుపై ఉంది? కన్సల్టెన్సీకి గల సంబంధం.. రిజిస్ట్రేషన్ చేసి ఉంటే అందుకు సంబంధించిన పత్రాలు ఇవ్వాలని పోలీసులు కోరారు. దీంతో పాటు గుంటూరులో ఉన్న కన్సల్టెన్సీకి, లండన్‌లో చేసిన వ్యాపారానికి గల సంబంధం ఏమిటీ..? ఎక్కడెక్కడ కన్సల్టెన్సీకి బ్రాంచీలు ఉన్నాయి, ఫిర్యాదు క్రాంతికుమార్ ఏ విధంగా తెలుసు? కేసు నమోదైన తర్వాత క్రాంతికుమార్‌తో జరిపిన సంభాషణ? తదితర ప్రశ్నలను పోలీసు అడిగినా.. ఆమె సరైన సమాధానాలను ఇవ్వలేదని తెలుస్తోంది. గత విచారణ సందర్భంగా పోలీసుల అడిగిన కొన్ని ప్రశ్నలకు.. ఇవాళ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చినట్టు సమాచారం. తనపై ఉన్న లుక్ అవుట్ నోటీసు రద్దు చేస్తే.. లండన్ వెళ్లిపోతానని, భర్త మధుకర్ భారత్‌కు రాగానే విచారణ చేయాలని న్యాయవాదుల ద్వారా పోలీసులను కోరినట్టు సమాచారం. ఆమె వినతిపై పోలీసులు న్యాయ సలహాతో ముందుకెళ్లనున్నట్లు తెలుస్తోంది.

# వివాహేతర సంబంధంలో విభేదాలు.. మహిళను చంపి మూటకట్టి..

**నెల్లిమర్ల, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్:** :వివాహేతర సంబంధం.. ఓ వివాహిత హత్యకు కారణమైంది. ఈ ఘటన విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం పెద్దనడిపిల్లి గ్రామంలో చోటుచేసు కుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దనడిపల్లి గ్రామానికి చెందిన మహిళతో అదే గ్రామానికి చెందిన లంకలపల్లి బంగారు బాబు మధ్య వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల వారిమధ్య విభేధాలు వచ్చాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆమె.. బంగారుబాబుకు ఫోన్ చేసి ఆయన ఇంటికి వెళ్లింది. అదే సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా.. నిందితుడు ఆమె ఛాతిపై కుర్చొని నోరు ముక్కు గట్టిగా నొక్కడంతో ఊపిరాడక ఆమె మృతిచెందింది. అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో మూటకట్టి సారిపల్లి సమీపంలో పడేసి ఇంటికెళ్లాడు. తన భార్య కనిపించడం లేదని ఆమె భర్త పూసపాటిరేగ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై మృతదేహాన్ని తరలిస్తున్న సీసీటీవీ ఫుటేజీ పోలీసులకు లభించింది. నిందితుడు బంగారుబాబు పెద్దనడిపిల్లి గ్రామ సమీపంలోని కొబ్బరితోటలో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వివాహేతర సంబంధం కారణంగా ఏర్పడిన విభేదాల నేపథ్యంలోనే బంగారుబాబు ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధరణకు వచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ
- ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్న మంత్రి
- మెరుగైన పాలన లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం





**నక్కపల్లి, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్ :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను ప్రాధాన్యంగా తీసుకుని సంబంధిత శాఖల ద్వారా వేగంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందిం చడమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమా వేశంలో హోంమంత్రి అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన వివిధ సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారు లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకోకుండా సమన్వయంతో పనిచేయాలని సూచిం చారు.తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ సంబంధిత అంశాలు తదితర ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రజలకు అందాల్సిన సేవలు సమయానికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హోంమ ంత్రి ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా సమర్థవ ంతమైన పాలన అందించగలమని అభిప్రాయపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందు కు తీసుకెళ్తోందని అనిత పేర్కొన్నారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం రాజీ పడబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంతో పాటు పారదర్శక పాలనను అమలు చేయడంపై దృష్టి సారిస్తున్నా మని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొంటూ, సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి

- ప్రాసంగులపాడులో తాగునీటి పథకం ప్రారంభం
- రూ.33.70 లక్షలతో ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటు
- ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరే లక్ష్యమన్న ప్రభుత్వం
- గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం





**బాపట్ల, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్:** కొరిశపాడు మండలం ప్రాసంగులపాడులో రూ.33.70 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటికీ మంచినీటి కుళాయిల పథకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి నాణ్యమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేం దుకు అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్నామని చెప్పారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి ల ద్వారా నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. మహిళలు, వృద్ధులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఈ పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతోందన్నారు. ప్రాసంగులపాడులో చేపట్టిన ఈ పథకం పూర్తికావడంతో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. నీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో తాగునీటి పాత్ర కీలకమ ని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి ఇంటికి నీటి కనెక్షన్ అందించాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన కొనసాగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధి, ప్రజా సంక్షేమ మే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.

# విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టి



- పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి
- విద్యా ప్రమాణాల పెంపుపై కలెక్టర్ ఆదేశాలు
- సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం
- ఆరోగ్యవంతమైన విద్యా వాతావరణం లక్ష్యంగా చర్యలు

**కాకినాడ, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్ :** పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ, స్వచ్ఛమైన మరియు ఆరోగ్యవంతమైన విద్యా ప్రాంగణాల రూపకల్పనకు సంబంధించిన అంశాలపై పాఠశాల విద్యాశాఖతో పాటు జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారు లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ని ప్రభుత్వ పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు, విద్యా ఫలితాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, బోధనలో వినూత్న విధానాలను అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశిం చారు.పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగు దొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యాసంస్థను ఆరోగ్యవం తమైన, సురక్షితమైన విద్యా ప్రాంగణంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అనుకూల మైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను కూడా కలెక్టర్ సమీక్షించారు. వసతి, ఆహారం, ఆరోగ్య పరిరక్షణ, విద్యా సదుపా యాల విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణ అంశాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి అంశాన్ని బాధ్యతాయుతంగా నిర్వహి ంచాలని సూచించారు. సమావేశంలో పాఠశాల విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పంటలపై కాటసాని ఆందోళన

- తమ్మరాజుపల్లెలో రైతులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే
- సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్
- గోరకల్లు జలాశయంలో నీరు ఉన్నా రైతులకు అందడం లేదని విమర్శ
- రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామన్న వైఎస్సార్సీపీ





**నంద్యాల, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్:** పాణ్యం నియోజకవ ర్గంలోని తమ్మరాజుపల్లె గ్రామ పరిధిలో ఎండిపోతున్న పంట పొలాలను వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మంగళవారం పరిశీలిం చారు. పంట నష్టంతో ఆందోళన చెందుతున్న రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాభావం, సాగునీటి కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాటసాని రామభూపాల్ రెడ్డి, వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం స్పందించడం లేదని విమర్శించారు. రైతుల కష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.గోరకల్లు జలాశయంలో తగినంత నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతుల పంటలకు నీటిని విడుదల చేయకపోవ డం దురదృష్టకరమని కాటసాని అన్నారు. సాగునీరు అందకపోవడంతో భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోతున్నాయని, బోర్లు రీఛార్జ్ కాక రైతులు మరింత నష్టపోతున్నారని తెలిపారు. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు ఎంతో కష్టపడి సాగు చేసిన పంట లు కళ్లముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని ప్రభుత్వం గుర్తించి వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల బాధలను కేవలం నివేదికల ద్వారా కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వ ప్రతినిధులకు సూచించారు.ఎండిపోతున్న పంటలను, నష్టపోతున్న రైతుల పరిస్థితిని అధికారులు ప్రత్యక్షంగా చూడాలని కాటసాని రామభూపాల్ రెడ్డి అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సాగునీరు అందే వరకు వైఎస్సార్సీపీ రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని కాటసాని తెలిపారు. రైతుల ఆర్థిక నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని కూడా డిమాండ్ చేశారు. రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీలో చేరారంటూ దాడులా?



**ఎన్టీఆర్ జిల్లా రాజధాని వాయిస్:** కంచికచర్ల మండలం మోగులూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీలో చేరిన కొందరిపై జరిగినట్లు ఆరోపణలు వచ్చిన దాడి ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పందించారు. రాజకీయ కక్షతో దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొ న్నారు. ప్రజలు తమకు నచ్చిన రాజకీయ పార్టీని ఎంచుకునే హక్కు కలిగి ఉంటారని, ఆ స్వేచ్ఛను హింసతో అడ్డుకునే ప్రయత్నా లు సమర్థనీయం కాదన్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన షేక్ హర్షద్, షేక్ మౌలానా, షేక్ అహ్మద్, షేక్ నజీర్‌లపై దాడి జరిగిన ట్లు సమాచారం రావడంతో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. బాధితులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెబుతూ ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కొందరు రాజకీయంగా అసహనా నికి గురవుతున్నారని తంగిరాల సౌమ్య విమర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా తీసుకునే రాజకీయ నిర్ణయాలను గౌరవించాల్సిందిపోయి బెదిరింపులు, దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో విభేదాలు ఉండవచ్చని, కానీ వాటిని హింస రూపంలో వ్యక్తపరచడం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యల ను ప్రభు త్వం ఉపేక్షించబోదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాజకీయ కారణాల తో ఎవరిపైనా దాడులు జరగకుండా చట్టపరమైన చర్యలు తీసుకు నేలా అధికార యంత్రాంగం దృష్టికి ఈ విషయాన్ని తీసుకె ళ్తామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు.మోగులూరు ఘటనలో బాధిత కుటుంబా లకు తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు అండగా ఉంటారని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదా లు సహజమే కానీ వాటిని హింసతో పరిష్కరించాలనుకోవడం తప్పని అన్నారు. రాజకీయ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే జరగాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుతో పోటీ పడాలి కానీ దాడులు, బెదిరింపులతో కాదని ఎమ్మెల్యే హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణ బాబునేతలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# లోకేష్ పర్యటన విజయవంతం చేయాలి



**నెల్లూరు రాజధాని వాయిస్:** తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర విద్యా, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ రేపు కోవూరు నియోజకవర్గంలో పర్యటించను న్న నేపథ్యంలో ఆ పర్యటనను విజయవంతం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యువనేతకు ఘన స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కోవూరు నియోజకవర్గా నికి విచ్చేస్తున్న నారా లోకేష్‌కు అడుగడుగునా బ్రహ్మరథం పట్టాల ని ఎమ్మెల్యే సూచించారు. స్వాగత కార్యక్రమం నుంచి వీడ్కోలు వరకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని పర్యటనను విజయవం తం చేయాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడికి ఇది అందించే గౌరవమని పేర్కొన్నారు.నారా లోకేష్ కోవూరుకు చేరుకున్న అనంతరం భారీ ర్యాలీలో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమా లకు నియోజకవర్గం నలుమూలల నుంచి కార్యకర్తలు హాజరుకా వాలని కోరారు. కేడర్ సమావేశం పార్టీ సంస్థాగత బలోపేతానికి ఎంతో కీలకమని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమం, భవిష్యత్ కార్యాచరణ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమా లపై చర్చ జరగనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్త తప్పని సరిగా పార్టీ సభ్యత్వ కార్డును వెంట తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో సభ్యత్వ కార్యక్రమానికి సంబంధించిన అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కోవూరు పర్యటనను చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. యువనేత వెంట అడుగులో అడుగు వేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఒక్క రోజు ముందే ఇబ్రహీంపట్నం పీఎస్‌కు యూట్యూబర్ నందన

**ఇబ్రహీంపట్నం రాజధాని వాయిస్:** యూట్యూబర్ నందన మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టే షన్ వచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 16లోగా స్టేషన్‌లో హాజరుకావాల్సి ఉంది. దీంతో ఒకరోజు ముందే ఆమె పోలీసుల ఎదుట హాజర య్యారు.ఇటీవల శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట యిన నందనను పోలీసులు ఇబ్రహీంపట్నం పీఎస్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారంటూ నందన, ఆమె భర్తపై ఆరోపణలు ఉన్నాయి. పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో ఇబ్రహీంపట్నం పీఎస లో గతంలో కేసు నమోదైంది. ఈ విషయం వెలుగులోకి రాగానే నందన దంపతులు అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఏపీ పోలీసు లు లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) జారీ చేశారు. ఈ క్రమంలో బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో స్వదేశానికి ఒంటరిగా బయలు దేరిన నందన సోమవారం శంషాబాద్‌లో దిగారు. ఆమె పాస్‌పోర్ట్, వీసా పత్రాలు తనిఖీ చేసిన ఇమిగ్రేషన్ అధికారులు ఎల్‌వోసీ ఆధారంగా అదుపులోకి తీసుకొని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

## శుద్ధ గుంతల కాలనీలో అన్నదానం



కారంపూడి.సెప్టెంబర్ 15రాజదాని వాయిస్ :మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలోని శుద్ధ గుంతల కాలనీలో వినాయక చవితి మహోత్సవములు సందర్భంగా రెండవ రోజు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పంగులూరు అంజయ్య మాజీ టిడిపి తెలుగు యువత అధ్యక్షులు తుపాకుల రత్తయ్య ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం కమిటీ సభ్యులు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు జనసేన అండగా ఉంటుంది

**నియోజకవర్గ ఇన్చార్జి బూసా రామాంజనే యులు**

**మృతిచెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి 5 లక్షల ఆర్థిక సాయం**

కారంపూడి. సెప్టెంబర్ 15 రాజదాని వాయిస్ : మాచర్ల మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్త శీలం శ్రీను మృతిచెందిన నేపథ్యంలో, ఆయన కుటుంబానికి జనసేన పార్టీ అండగా నిలిచింది.ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ మాచర్ల నియోజకవర్గ సమన్వయకర్త బుసా రామాంజనేయులు శీలం శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా బుసా రామాంజనేయులు మాట్లాడుతూ, శీలం శ్రీను పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన క్రియాశీల కార్యకర్త అని, ఆయన మృతి పార్టీకి మరియు కార్యకర్తలకు తీరని లోటని అన్నారు. శ్రీను కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్పందించి పార్టీ కార్యకర్త చనిపోతే 5 లక్షల రూపాయల చెక్కును పంపించారు.కష్టకాలంలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం ద్వారా కార్యకర్తల



కుటుంబాల పట్ల పార్టీకి ఉన్న బాధ్యతను చాటిచెప్పడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా శ్రీను కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హరి, మాచర్ల మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుండెబోయిన సాంబశిరావు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానికులు పాల్గొని శీలం శ్రీను కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మాచర్ల ప్రజల సంక్షేమమే లక్ష్యం

**యాగంటి మల్లికార్జున రావు**

**కుటుంబ సమేతంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు**



మాచర్ల, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్ : పట్టణంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు కుటుంబ సమేతంగా పలు వార్డుల్లోని వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారికి హారతులు సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మాచర్ల నియోజకవర్గ ప్రజలందరిపై విఘ్నేశ్వరుడి ఆశీస్సులు సదా ఉండాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలు కేవలం పూజలకే పరిమితం కాకుండా ప్రజల్లో సోదరభావం, ఐక్యతను పెంపొందించే వేదికలని పేర్కొంటూ, ప్రజల సంక్షేమమే తమ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు. మండపాల వద్ద నిర్వాహకులు, యువత ఆయనకు ఘన స్వాగతం పలకగా, ఆయన స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తూ ఉత్సాహం నింపారు. ఈ పూజా కార్యక్రమాల్లో శివ, యాగంటి ప్రతాప్, మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, అల్లం వెంకటేశ్వర్ రెడ్డి, చెన్న, బొట్టు కోటేశ్వరరావు, కృష్ణ, స్వామి, కొండలు, వెంకటేష్, శ్రీనులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులకు వినతి

**సమాచార హక్కు పరిరక్షణ ఐక్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.కుమార్ డిమాండ్**



పిడుగురాళ్ల.సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్ :స్థానిక ఆక్స్‌ఫర్డ్ సాయి విహార్ సమీపంలోని సర్వే నెంబర్ 848లో గల సుమారు రెండు ఎకరాల వాగు పోరంబోకు ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుండి కాపాడాలని సమాచార హక్కు పరిరక్షణ ఐక్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త కె.కుమార్ రెవెన్యూ అధికారులను కోరారు. గతంలో ఇక్కడ రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వ భూమిగా సూచిక బోర్డు ఏర్పాటు చేసిందని, అయితే ఇటీవల కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా విభజించి క్రయవిక్రయాలకు యత్నిస్తున్నారని ఆయన అధికారులకు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆక్రమణలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే న్యాయపరమైన చర్యల నిమిత్తం లోకాయుక్తతో పాటు ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ఫిర్యాదును పరిశీలించి రికార్డుల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



## ఆళ్ల నాని మృతి పట్ల విడదల రజిని సంతాపం

చిలకలూరిపేట.సెప్టెంబర్ 15రాజధాని వాయిస్ :మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) ఆకస్మిక మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. ఆయన మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అలాగే ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పారిశుద్ధ్యంపై ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష

- గుడివాడలో పారిశుద్ధ్య నిర్వహణపై సమావేశం
- సమస్యలను ముందుగానే గుర్తించాలని సూచన
- చెత్త తొలగింపులో నిర్లక్ష్యానికి హెచ్చరిక
- పరిశుభ్రమైన పట్టణమే లక్ష్యమన్న ఎమ్మెల్యే



గుడివాడ, సెప్టెంబర్ 15రాజధాని వాయిస్ : గుడివాడ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో ఉన్న పారిశుద్ధ్య సమస్యలను సమగ్రంగా సమీక్షిస్తూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డ్రైన్లలో పేరుకుపోయిన మట్టిని తొలగించడం, రోడ్ల పరిశుభ్రత, వర్షపు నీరు నిలిచే ప్రాంతాల గుర్తింపు, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు, అవసరమైన వాహనాల కొరత తదితర అంశాలపై చర్చించారు. ప్రతి వార్డులో సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రజలు ఫిర్యాదు చేసే వరకు వేచి ఉండకుండా సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులకు స్పష్టం చేశారు.

## సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరాలి

- మత్స్యకారుల సమస్యలపై సమీక్ష
- నక్కపల్లిలో సంఘాల ప్రతినిధులతో సమావేశం
- సహకార సంఘాల ఎన్నికలకు సమష్టిగా పనిచేయాలని పిలుపు




అనకాపల్లి, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్ : నక్కపల్లిలో మత్స్యకార సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సమావేశమై వారి సమస్యలు, సంఘాల ప్రస్తుత పరిస్థితులు, రాబోయే సహకార సంఘాల ఎన్నికల సన్నద్ధతపై విస్తృతంగా చర్చించారు. మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. సమావేశంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంఘాల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై అభిప్రా యాలు వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి వారికి హామీ ఇచ్చారు. మత్స్యకారుల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వంగలపూడి అనిత తెలిపారు. పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సహాయం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మత్స్యకార సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. సంఘాల అభివృద్ధి ద్వారా మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ దిశగా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాబోయే సహకార సంఘాల ఎన్నికలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. సంఘాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. సహకార సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మత్స్యకారుల సంక్షేమం, సంఘాల బలోపేతమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. సమావేశంలో మత్స్యకార సంఘాల నాయకులు, ప్రతినిధులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ బహిరంగ చర్చకు రావాలి: కాకాణి

- చెత్త సేకరణలో రూ.1190 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపణ
- సీఎస్ఆర్ నిధుల వినియోగంపై బహిరంగ చర్చకు సవాల్
- కలెక్టర్ పర్యవేక్షణలోనే నిధుల ఖర్చు జరగాలని డిమాండ్




నెల్లూరు, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. శాసన మండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో చెత్త సేకరణ పేరుతో భారీ స్థాయిలో నిధుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఈ అంశంపై బహి రంగ చర్చకు సిద్ధమని, ఆరోపణలు నిరాధారమైతే ప్రజలే తమను తప్పుబడతారని అన్నారు. చెత్త సేకరణ వ్యవహారంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని నిరూపించే ధైర్యం ఉంటే మంత్రి నారా యణ బహిరంగ చర్చకు రావాలని కాకాణి సవాల్ విసిరారు. డంపింగ్ యార్డుల వద్ద రాజకీయ వ్యాఖ్యలు చేయడం కాకుండా ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. చెత్త నిర్వహణలో రూ.1190 కోట్ల స్కామ్ జరిగిందని తాము చెబుతున్న ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు, పత్రాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు.కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల వినియోగంలో కూడా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని కాకాణి ఆరోపించారు. కంపెనీల నికర లాభాల్లో రెండు శాతం సీఎస్ఆర్ నిధులు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ కావాలని, కలెక్టర్ అనుమతితోనే అభివృద్ధి పనులకు వినియోగిం చాలనే నిబంధనలు ఉన్నాయని వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో హౌసింగ్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సీఎస్ఆర్ నిధులను పూర్తిగా పారదర్శకంగా వినియోగించామని తెలిపారు. ప్రస్తుతం అయితే కలెక్టర్ పర్యవేక్షణ లేకుండా నిధులను నేరుగా ఖర్చు చేస్తూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. అంచనాలు ఎవరు సిద్ధం చేశారు, ఏ అధికారులు ఆమోదం తెలిపారు అనే విషయాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రూ.25 కోట్ల ఖర్చు చేశామని చెబుతున్నప్పటికీ, వాస్తవంగా అందులో చాలా తక్కువ మొత్తం మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.ఒక చెట్టును నాటడానికి రూ.5 వేల రూపాయలు, దాన్ని పెంచడానికి మరో రూ.7 వేల రూపాయలు ఖర్చు చేసినట్లు చూపించడం విచిత్రంగా ఉందని కాకాణి ఎద్దేవా చేశారు. రూ.50 లక్షల పనులను రూ.3 కోట్లుగా చూపిస్తూ తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నారని, కంపెనీలపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నారాయణ బహిరంగ చర్చకు రాకపోయినా తాము వెనక్కి తగ్గబోమని కాకాణి స్పష్టం చేశారు. ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలను వివరిస్తామని, అవసరమైతే కలెక్టరేట్ ఎదుట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ నిధుల వినియోగంలో జరుగుతున్న అక్రమాలను బయటపెడతామని హెచ్చరించారు. ప్రజల డబ్బుకు పూర్తి లెక్కలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఈ అంశంపై పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## అంగన్‌వాడీల బలోపేతానికి సమాజ భాగస్వామ్యం కావాలి

- 'మన అంగన్‌వాడి.. మన బాధ్యత' నినాదంతో పోషణ మాసం నిర్వహణ
- పోషకాహారం, మాతృ సంరక్షణ, బాల్య వికాసంపై ప్రత్యేక దృష్టి
- అంగన్‌వాడీల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్న కేంద్ర మంత్రి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 రాజధాని వాయిస్: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పోషణ మాసం సందర్భంగా 'హమారీ అంగన్‌వాడీ.. హమారీ జిమ్మేదారీ' అనే నినాదంతో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోషకాహారం, మాతృ సంరక్షణ, చిన్నారుల సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నందున వాటి బలోపేతానికి సమాజం మొత్తం బాధ్యత వహించాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం ప్రభు త్వ సేవా కేంద్రాలు మాత్రమే కాకుండా, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో తల్లులు, చిన్నారుల ఆరోగ్యాభివృద్ధికి ముఖ్యమైన వేదిక లుగా నిలుస్తున్నాయని మంత్రి వివరించారు. గర్భిణీలు, బాలిం తలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య అవగాహ న, ప్రారంభ బాల్య విద్య వంటి సేవలను అంగన్‌వాడీలు అందిస్తు న్నాయని తెలిపారు. ఈ సేవలు మరింత సమర్థవంతంగా అందా లంటే స్థానిక సమాజం చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.పోషణ మాసం కార్యక్రమాల ద్వారా తల్లులు, కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీలతో అనుసంధానం కావాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. పోషకాహార లోపం, రక్తహీనత, తల్లి-శిశు ఆరోగ్య సమస్యలను తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు వెల్లడించింది. ప్రతి కుటుంబం పోషకాహార ప్రాముఖ్యతను గుర్తించి చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచిం చింది. అంగన్‌వాడీలను మరింత సదుపాయాలతో అభివృద్ధి చేయ డం, డిజిటల్ సేవలను విస్తరించడం, సిబ్బందికి శిక్షణ అందిం చడం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది. చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను క్రమం తప్పకుండా పర్యవేక్షించేందుకు ఆధునిక విధానాలను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.'మా సంగ్ పోషణ్', 'మా కే సాథ్ పోషణ్ కే సంగ్' వంటి కార్యక్రమాల ద్వారా తల్లుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com